క్లుప్తంగా

చట్టానికి ఎవరూ అతీతులు కాదు


కాశి బాలమునికుమారి

ముమ్మిడివరం: చట్టానికి ఎవరూ అతీతులు కాదని చంద్రబాబు అరెస్టునుద్దేశించి హితకారిణి సమాజం చైర్‌పర్సన్ కాశిబాలమునికుమారి అన్నారు. ముమ్మిడివరంలో ఆమె బుధవారం విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఎన్నో కుంభకోణాలకు పాల్పడ్డారన్నారు. టీడీపీ హయాంలో తీసుకొచ్చిన స్కిల్ డెవలప్‌మెంట్‌లో రూ.వందల కోట్ల అవినీతి జరిగిందంటూ అందిన ఫిర్యాదులపై సీఐడీ అధికారులు పూర్తి స్థాయి విచారణ చేపట్టారన్నారు. దర్యాప్తు సంస్థల విచారణలో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు అవినీతికి పాల్పడడంతో పాటు కొన్ని షెల్ కంపెనీల ద్వారా హవాలా రూపంలో విదేశాలకు సొమ్ము మళ్లించినట్లు గుర్తించారన్నారు. అందుకే సీఐడీ పోలీసులు చంద్రబాబును అరెస్టు చేశారన్నారు. అరెస్టు వెనుక రాజకీయ దురుద్దేశం ఉందంటూ టీడీపీ నేతలు చేస్తున్న వ్యాఖ్యలను ఆమె ఖండించారు.

రూ.35 లక్షలతో వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ ఆధునీకరణ

అమలాపురం టౌన్: మున్సిపాలిటీలో తాగునీటి సరఫరాకు సంబంధించి వాటర్ వర్క్స్‌లో 4 ఎమ్మెల్డీ (4 లక్షల లీటర్ల తాగునీరు అందించే) ట్రీట్‌మెంట్ ప్లాంట్‌లో నీటిని శుద్ధీకరణ చేసేందుకు ఇప్పటి వరకూ వినియోగంలో ఉన్న ఇనుప కాలిఫిక్యులేటర్ బ్రిడ్జి తుప్పు పట్టి తరచు పాడవుతోంది. స్వచ్ఛమైన నీరును అందించే దిశగా ఈ ఇనుక కాలిఫిక్యులేటర్ పరికరం స్థానే రూ.35 లక్షల వ్యయంతో స్టెయిన్‌లెస్ స్టీల్‌తో అధునాతనమైన పరికరాన్ని అమర్చుతున్నారని మున్సిపల్ కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మరమ్మతు పనులు, కొత్త పరికరం ఏర్పాటు పూర్తయ్యే నెల రోజుల వరకూ తాగునీటి సరఫరాలో కొంత ప్రతికూల పరిస్థితి అనివార్యమయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. నెల రోజుల పాటు పట్టణ ప్రజలు కాచి చల్లార్చిన నీరు మాత్రమే తాగాలని కమిషనర్ నాయుడు సూచించారు.

నేడు రామాలయానికి శంకుస్థాపన

ఐ.పోలవరం: మండలంలోని కొమరగిరి పంచాయతీ పరిధి రామారావుపేటలో సోమవారం ఉదయం రామాలయానికి శంకుస్థాపన జరుగనుంది. తిరుమల తిరుపతి దేవస్థానం సమకూర్చిన రూ.10లక్షలు, గ్రామస్తుల సహకారంతో ఈ ఆలయం నిర్మిస్తున్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే, టీడీపీ బోర్డు సభ్యుడు పొన్నాడ వెంకటసతీష్‌కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొంటారని మండల పార్టీ కన్వీనర్ పిన్నంరాజు వెంకటపతిరాజు ఒక ప్రకటనలో తెలిపారు.

పారిశుధ్య కార్మికుల వేతనాల పెంపునకు ప్రణాళిక

యానాం: పుదుచ్చేరి వ్యాప్తంగా ఉన్న పారిశుధ్య కార్మికులకు 15శాతం మేర వేతనాలను పెంచేందుకు కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసినట్లు నేషనల్ శానిటరీ వర్కర్స్ కమిషన్ అధ్యక్షుడు ఎం.వెంకటేషన్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఆసుపత్రులు, పార్కులు తదితర ప్రాంతాల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులతో ఆయన మాట్లాడారు. అనంతరం ప్రధాన కార్యదర్శి రాజీవ్‌వర్మ, ఆదిద్రావిడ శాఖ కార్యదర్శి నెదుంజళియన్, కలెక్టర్ వల్లవన్‌లో చర్చించారు.

సభలో పలు తీర్మానాలు

యానాం: ఈనెల 20 నుంచి జరుగనున్న పుదుచ్చేరి అసెంబ్లీ సమావేశాల్లో పలు తీర్మానాలను ప్రవేశపెట్టనున్నట్లు ఆదివారం స్పీకర్ ఆర్.సెల్వం తెలిపారు. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులకు మెడికల్ కోర్సుల్లో 10శాతం రిజర్వేషన్ల ఆమోదంపై కేంద్రానికి, ఎల్జీ తమిళిసైకి, సీఎం రంగసామికి కృతజ్ఞతలు తీర్మానం, జి–20 సమావేశాలు, చంద్రయాన్ ఉపగ్రహాన్ని విజయవంతం చేసిన శాస్త్రవేత్తలకు కృతజ్ఞతల తీర్మానాలను ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు.

లక్ష బిల్వార్చన

కాట్రేనికోన: శ్రావణమాసం సందర్భంగా కుండలేశ్వరంలో వేంచేసి ఉన్న పార్వతీ సమేత కుండలేశ్వరస్వామి వారి అర్చకుల కుటుంబం కాళ్ళకూరి ట్రస్టు ఆధ్వర్యంలో స్వామికి లక్ష బిల్వార్చన చేశారు. స్వామి అర్చక కుటుంబం కాళ్ళకూరి ట్రస్టు ప్రతి ఏటా శ్రావణ మాసంలో ఒక రోజున ఈ విధంగా పూజా కార్యక్రమం చేస్తారు.

ఉదయ్‌నిధి స్టాలిన్ వ్యాఖ్యలకు ఖండన

అమలాపురం రూరల్: భారత రాజ్యాంగంపై ప్రమాణం చేసిన తమిళనాడు మంత్రి ఉదయ్‌నిధి స్టాలిన్ సనాతన ధర్మాన్ని దోమల నిర్మూలన చర్యతో పోలుస్తూ ద్వేషపూరితంగా మాట్లాడడం దారుణమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు యాళ్ల దొరబాబు తీవ్రంగా ఖండించారు. అమలాపురంలో ఆదివారం మాట్లాడుతూ ఈ దేశాన్ని నిందించే ఎవరైనా కూడా పాకిస్తాన్ వెళ్లి బతకాలని, ఇలాంటి వ్యాఖ్యలు అంబేద్కర్ రాజ్యాంగానికి పూర్తిగా విరుద్ధం, ఇటువంటి వారి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని దొరబాబు అన్నారు.

సాంకేతికతతో మరింత సౌలభ్యం

- అమలాపురంలో అందుబాటులోకి డిజిటల్ లైబ్రరీ
- కంప్యూటర్లు, ఇంటర్నెట్ సౌకర్యంతో క్షణాల్లో ఉద్యోగ సమాచారం
- సద్వినియోగం చేసుకుంటున్న నిరుద్యోగ యువత


అమలాపురంలో డిజిటల్ లైబ్రరీ భవనం


డిజిటల్ లైబ్రరీలో సమాచారాన్ని సేకరిస్తున్న నిరుద్యోగ యువతులు

అమలాపురం టౌన్: గ్రంథాలయాలు అంటే అన్ని రంగాలకు చెందిన పుస్తకాల సమాహారం. పుస్తకాలను అందుబాటులో ఉంచి తద్వారా ప్రజలకు విజ్ఞానాన్ని అందించే ఆలయాలు. అయితే సాంకేతికత దూసుకువస్తున్న ప్రస్తుత పరిస్థితుల్లో అమలాపురం మున్సిపాలిటీ డిజిటల్ లైబ్రరీని అందుబాటులోకి తీసుకువచ్చింది. గతంలో స్థానిక అశోక్ నగర్‌లో ఉండే సాధారణ గ్రంథాలయాన్ని ఇటీవల డిజిటల్ గ్రంథాలయంగా తీర్చిదిద్దింది. గతంలో ఇదే గ్రంథాలయంలో నిరుద్యోగ యువత ఉద్యోగావకాశాల కోసం పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు అందుబాటులో ఉండేవి. ఇప్పుడు నిరుద్యోగ యువత అలాంటి పుస్తకాల అవసరం లేకుండా ఆ డిజిటల్ గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన నాలుగు కంప్యూటర్ల ద్వారా ఇంటర్నెట్ సౌకర్యంతో ఇట్టే ఉద్యోగ సమాచారాన్ని పొందుతున్నారు. అప్పుడు పుస్తకాలు తెరచి చదివితే ఇప్పుడు కంప్యూటర్ మౌస్‌ను క్లిక్ చేసి తెరపై క్షణాల్లో తమకు కావాల్సిన ఉద్యోగ సమాచారాన్ని వీక్షిస్తున్నారు. పాఠకులకు ఒక్క ఉద్యోగ సమాచారమే కాదు ఏ సమాచారమైనా ఇంటర్నెట్ ద్వారా కంప్యూటర్లలో వీక్షించే డిజిటల్ సౌకర్యం కల్పించింది. ఈ గ్రంథాలయంలో ఆన్‌లైన్ ద్వారా నాలుగు కంప్యూటర్లు ఉంటే, ఆఫ్ లైన్ ద్వారా పలు పత్రికలు, పుస్తకాలు అందుబాటులో ఉంచుతున్నారు. ముఖ్యంగా నిరుద్యోగ యువత ఈ గ్రంథాలయానికి నిత్యం వచ్చి కంప్యూటర్ల ద్వారా తమకు కావాల్సిన ఉద్యోగ సమాచారాన్ని చిటికెలో పొందుతున్నారు. లైబ్రేరియన్ సాకా సత్యశ్రీ పర్యవేక్షణలో ఈ డిజిటల్ లైబ్రరీ నడుస్తోంది. మరింత మంది నిరుద్యోగులకు ఉపయోగపడేలా కంప్యూటర్ల సంఖ్యను పెంచేందుకు ఇటీవల మున్సిపాలిటీని అభ్యర్థించారు. మున్సిపాలిటీ అశోక్‌నగర్‌లో అప్పటి వరకూ ఉన్న సాధారణ గ్రంథాలయాన్ని రూ.30 లక్షలతో గ్రౌండ్ ఫ్లోర్ +1గా డిజటల్ లైబ్రరీ కోసం అధునాతన భవనాన్ని నిర్మించింది.

సేవలను ఉపయోగించుకుంటున్నాం



అమలాపురంలో అందుబాటులోకి వచ్చిన డిజిటల్ లైబ్రరీ సేవలను పూర్తి స్థాయిలో ఉపయోగించుకుంటున్నాం. ఉద్యోగ సమాచారమే కాదు ఏ రంగానికి సంబంధించిన సమాచారమైనా ఈ లైబ్రరీకి వెళ్లి ఉచితంగా తెలుసుకుంటున్నాం. సామాన్య కుటుంబాలకు చెందిన నిరుద్యోగులకు ఈ లైబ్రరీ చాలా ఉపయుక్తంగా ఉంది. కంప్యూటర్లు, ఇంటర్నెట్ సౌకర్యాన్ని మరింత పెంచాలి.

–కటికదల వెంకటరాజు, నిరుద్యోగి, అమలాపురం

త్వరలో మరిన్ని కంప్యూటర్లు



మున్సిపాలిటీ ఆధ్వర్యంలో నడుస్తున్న డిజిటల్ లైబ్రరీని వినియోగించుకునేందుకు నిరుద్యోగ యువత ఎక్కువగా ముందుకు వస్తున్నారు. వీరి అవసరాలకు అనుగుణంగా ఆ లైబ్రరీలో ప్రస్తుతం ఉన్న నాలుగు కంప్యూటర్లకు అదనంగా మరికొన్ని పెంచేందుకు చర్యలు చేపడతాం. అన్ని వర్గాల పాఠకులకు ఈ లైబ్రరీని మరింత అందుబాటులోకి తీసుకుని వచ్చే ప్రయత్నం చేస్తున్నాం.

– ఒమ్మి అయ్యప్పనాయుడు, కమిషనర్, అమలాపురం మున్సిపాలిటీ

దానం చేసే నేత్రాలు.. దారిని చూపే దీపాలు


సభలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకటేశ్వరరావు

అమలాపురం రూరల్: తన నేత్రాలను దానం చేయడం ద్వారా లోకాన్ని చూస్తున్న నేత్రదాత అమరజీవి సూర్యకాంతం అని పలువురు వక్తలు కొనియాడారు. సీఐటీయూ అఖిల భారత ఉపాధ్యక్షురాలు గోసంగి బేబీ రాణి మాతృమూర్తి సూర్యకాంతం సంస్మరణ సభ సీపీఎం కోనసీమ జిల్లా కార్యదర్శి కారెం వెంకటేశ్వరరావు అధ్యక్షతన ఆదివారం నందంపూడిలో జరిగింది. ఈ సందర్భంగా సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు కె.సుబ్బారావమ్మ, రాష్ట్ర నాయకులు సీహెచ్ నరసింగరావు మాట్లాడుతూ ఆమె పార్థివదేహాన్ని వైద్య సేవలకు అందించడమే కాకుండా ఆమె కుటుంబ సభ్యులు బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం ఉద్యమాల ద్వారా సేవలందిస్తున్నారని అన్నారు. సీపీఎం, సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘం, దళిత, ప్రజాసంఘాల నాయకులు పలివెల వీరబాబు అయితాబత్తుల రామేశ్వరరావు, కె.కృష్ణవేణి, బచ్చల కామేశ్వరరావు, గోసంగి సంపతరావు, పీతల రామచంద్రరావు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదమప్పుడు ప్రతీ క్షణం విలువైనదే


సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ విజయమనోజ్

అమలాపురం టౌన్: రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలించే సమయంలో ప్రతీ క్షణం విలువైనదేనని డాక్టర్ డి.విజయమనోజ్ అన్నారు. అమలాపురం సాయి సంజీవిని వాకర్స్ యోగా ఆరోగ్యసేవా సంస్థ, మహిళా ఆరోగ్య సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక కూచిమంచి అగ్రహారంలో ఆదివారం జరిగిన ఆరోగ్య అవగాహన సదస్సులో డాక్టర్ విజయమనోజ్ మాట్లాడారు. అతి వేగం, ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడం, మద్యం సేవించి వాహనం నడపడం వంటి కారణాలతో జరుగుతున్న రోడ్డు ప్రమాదాల పట్ల వాహన చోదకులు అప్రమత్తతో పాటు అవగాహనతో ఉండాలని డాక్టర్ మనోజ్ సూచించారు. 'రోడ్డు ప్రమాదాలు– గాయపడ్డ వారికి తక్షణ వైద్య సాయం' అనే అంశంపై ఆయన ఉపన్యసించారు. సదస్సుకు ఆ ఆరోగ్య సంస్థ అధ్యక్షుడు, మున్సిపల్ వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు అధ్యక్షత వహించారు. అనంతరం న్యాయవాది వెంపరాల భాస్కరశాస్త్రి 'మోటారు వాహన చట్టం– అవగాహన' అనే అంశంపై అవగాహన కల్పించారు. మద్యం తాగి వాహనం నడిపితే జరిమానాలు ఏ ఏ స్థాయిలో ఉంటాయో వివరించారు. అలనాటి లవకుశ సినిమాలోని కుశుడు పాత్రధారి వియ్యూరి నాగ సుబ్రహ్మణ్యంను సంస్థ ప్రతినిధులు సత్కరించారు. సంస్థ కార్యదర్శి నల్లా నరసింహమూర్తి, ఉపాధ్యక్షులు చాట్ల లక్ష్మీనారాయణ, కొప్పిశెట్టి నాగేశ్వరరావు, కడలి రామలక్ష్మి తదితరులు ప్రసంగించారు.

విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో ఎమ్మెల్యే పొన్నాడ


రాజానగరంలో శ్రీసీతారామ స్వాముల వారిని దర్శించుకున్న ఎమ్మెల్యే పొన్నాడ

కాట్రేనికోన: కాట్రేనికోన పంచాయతీ రాజానగరంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో ఆదివారం శ్రీవిఘ్నేశ్వర, శ్రీసీతారామ లక్ష్మణ, శ్రీఆంజనేయ స్వామి వార్ల యంత్ర, విగ్రహ, శిఖర ప్రతిష్ఠ మహోత్సవంలో ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంటసతీష్ కుమార్ పాల్గొన్నారు. నూతన ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం బ్రహ్మశ్రీ కాల్దారి వరప్రసాద్ శాస్త్రి ఆధ్వర్యంలో వేద పండితులు గణపతి పూజ, ప్రత్యేక హోమాలు చేపట్టారు. సర్పంచ్ గంటి వెంకట సుధాకర్, పాలెపు ధర్మారావు, సానబోయిన నాగేశ్వరరావు, వాసంశెట్టి శ్రీనివాసరావు ఉన్నారు.

సేవాదృక్పథంతో కార్యక్రమాలు

యానాం: సేవాదృక్పథంతో పాటు నిరుద్యోగ యువతకు తమ వంతు సహాయపడాలనే ఉద్దేశంతో వివిధ కార్యక్రమాలను చేపడుతున్నట్లు ది యానాం తెలగా కాపు అభ్యుదయ సంఘం అధ్యక్షుడు కాటంశెట్టి వెంకటరామమూర్తి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక గాజులవారివీధిలో యానాం కాపు ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగుల సంఘ ఏడవ వార్షికోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్య, వైద్యానికి సంఘం అధిక ప్రాధాన్యతనిస్తూ కార్యక్రమాలను చేపడుతుందన్నారు. సంస్థ అధ్యక్షుడు చింతం రామకృష్ణ సంస్థ చేపట్టిన సేవా కార్యక్రమాలను వివరించారు. కాపు కల్యాణ మంటపానికి రూ.లక్షా 8వేల చెక్కును సంఘం తరఫున అందజేశారు. ఇటీవల మృతిచెందిన బెజవాడా శేషుబాపనయ్యకు నివాళులర్పించారు. నాయకులు నల్లా వెంకన్న, గాజుల బ్రహ్మానందం, చెక్కల అరుణ్‌కుమార్, హంసాని రామలక్ష్మణుడు, ప్రతినిధులు పాల్గొన్నారు.

చరిత్ర అధ్యాపకుడు రాజేష్‌కు గోల్డ్ మెడల్


నేదూరి రాజేష్

మామిడికుదురు: మండలంలోని పెదపట్నం గ్రామానికి చెందిన నేదూరి రాజేష్‌ను ఆంధ్రా యూనివర్సిటీ స్నాతకోత్సవ సభలో చరిత్ర విభాగం నుంచి గోల్డ్ మెడల్‌తో సత్కరించారు. వైస్ చాన్స్‌లర్, ప్రొఫెసర్ పీవీజీడీ ప్రసాద్‌రెడ్డి చేతుల మీదుగా ఈ అవార్డు అందుకున్నారు. రాజేష్ ప్రస్తుతం మండపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చరిత్ర అధ్యాపకుడిగా విధులు నిర్వహిస్తున్నారు. చరిత్రపై రాజేష్ పలు పరిశోధనలు చేశారు. బౌద్ధ స్థూపాలు, కాకతీయుల చరిత్రపై పలు విశ్లేషణలు చేశారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ ప్రపంచ చరిత్రలో మన దేశ చరిత్ర ఎంతో గొప్పదన్నారు. చరిత్ర ఆధారాల విశ్లేషణల ద్వారా చరిత్ర పరిరక్షణకు నిరంతరం కృషి చేసేందుకు ఈ అవార్డు తనకు మరింత స్ఫూర్తిగా నిలుస్తుందని రాజేష్ పేర్కొన్నాడు.

పెరుగుతున్న సూసైడ్ మరణాల రేటు

యానాం: పుదుచ్చేరివ్యాప్తంగా నాలుగు రీజియన్‌లలోను ఆత్మహత్యల రేటు మూడుసార్లు పెరిగిందని రాష్ట్ర ఆరోగ్యశాఖ డైరెక్టర్ శ్రీరాములు పేర్కొన్నారు. ఆదివారం వరల్డ్ సూసైడ్ ప్రివెన్షన్ డే ను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతి రోజు ఏదో కారణం చేత ఆత్మహత్యకు పాల్పడుతున్న ఘటనలను నిరోధించేలా అందరిలోనూ చైతన్యం తీసుకురావాల్సి వుందన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఏడాదికి 7.03 లక్షల మంది ఆత్మహత్యకు పాల్పడుతుంటే దేశస్థాయిలో ప్రతి మూడు నిమిషాలకు ఒక సూసైడ్ నమోదవుతోందన్నారు. కుటుంబ సమస్యలు, ప్రేమవిఫలం, నిరుద్యోగం, వ్యాపారాల్లో నష్టాలు, మాదక ద్రవ్యాలకు బానిస కావడం వంటి కారణాలతోపాటు 90శాతం డిప్రెషన్‌లోకి వెళ్లేవారు ఎక్కువగా దేశంలో ఆత్మహత్యకు పాల్పడుతున్నారన్నారు.

నిరశన

అమలాపురం రూరల్: ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబునాయుడు అరెస్ట్‌కు నిరసనగా అమలాపురంలో టీడీపీ నాయకుడు మెట్ల రమణబాబు ఇంటి వద్ద ఆదివారం మాజీ ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, నాయకులు నిరాహార దీక్షలు చేశారు. క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు, సమన్వయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వాడపల్లి వెంకన్నకు పూజలు

ఆత్రేయపురం: వాడపల్లి శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ఏడు శనివారాల నోము ఆచరించిన భక్తులు స్వామి వారి అష్టోత్తర పూజల్లో పాల్గొన్నారు. ఉదయం స్వామికి సుప్రభాత సేవ, నీరాజన మంత్రపుష్పం, పుణ్యాహవాచనం తదితర పూజలను ఆలయ అర్చకులు ఘనంగా నిర్వహించారు.


నిత్యాన్నదాన భవన నిర్మాణానికి విరాళం

ఆత్రేయపురం: వాడపల్లి శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో నిర్మిస్తున్న నిత్యాన్నదాన భవన నిర్మాణానికి మెదక్ జిల్లా తెల్లాపూర్‌కు చెందిన ఆర్.సుబ్రహ్మణ్యం–రోజా దంపతులు రూ.38,700 విరాళం అందించినట్లు ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. దాతకు ఆయన చేతుల మీదుగా స్వామి చిత్రపటం అందజేశారు. నిత్యాన్నదాన భవన నిర్మాణానికి వెదిరేశ్వరానికి చెందిన ఎం.లక్ష్మీకుమార్‌రాజా రూ.20 వేలు, ఎస్.కాశీ విశ్వనాథరాజు–శారదాదేవి దంపతులు రూ.11,116, రాజమహేంద్రవరానికి చెందిన పి.నాగార్జున–సూర్యవీరవేణి దంపతులు రూ.10 వేలు, ఐ.పవన్‌కుమార్–ఫణికుమారి దంపతులు రూ.10,120, పాలకొల్లుకు చెందిన ఆర్.రామవెంకట సదాసాయి అభిషేక్ రూ.10,116, కడియం మండలం మాధవరాయుడుపాలేనికి చెందిన జి.లింగేశ్వరరావు, మాధవి దంపతులు రూ.10,116 విరాళం అందించినట్లు తెలిపారు.

కలవరపెడుతున్న గోదావరి కోత

- నదిలో కూలిపోతున్న కొబ్బరి చెట్లు
- లంకల్లో తీవ్రమైన నదీపాతం


అప్పనపల్లి వద్ద గోదావరిలో కూలిపోతున్న కొబ్బరి చెట్లు


అప్పనపల్లిలో వరదకు కొట్టుకుపోయిన గ్రోయిన్

మామిడికుదురు: వైనతేయ గోదావరి నదీ తీరంలోని లంక గ్రామాల్లో నదీపాతం తీవ్రంగా ఉంది. గోదావరి కోత రైతులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. రూ.కోట్లు విలువైన భూములు ఏటా నదీ గర్భంలో కలసి పోతున్నాయి. రోజు రోజుకూ నదీ పాతం ఉధృతమించడంతో రైతులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. మామిడికుదురు మండలంలోని పెదపట్నం, అప్పనపల్లి, పెదపట్నంలంక, బి.దొడ్డవరం, పాశర్లపూడి, పాశర్లపూడిలంక, బాడిలంక, ఆదుర్రు గ్రామాల్లో కోత ప్రభావం తీవ్రంగా ఉంది. కోత నివారణకు రివిట్‌మెంట్ల నిర్మాణంతో పాటు గ్రోయిన్లు ఏర్పాటు చేయాల్సి ఉంది.

కనుమరుగవుతున్న గ్రోయిన్లు...

గోదావరి నీటి ప్రవాహాన్ని మళ్లించి తద్వారా కోతను నివారించేందుకు గతంలో నిర్మించిన గ్రోయిన్లు, రివిట్‌మెంట్లు గోదావరిలోకి జారిపోతున్నాయి. అప్పనపల్లి, పెదపట్నంలంక, బి.దొడ్డవరం, పాశర్లపూడి, ఆదుర్రు తదితర గ్రామాల్లో ప్రస్తుతం ఇదే పరిస్థితి నెలకొంది. పై గ్రామాల్లో కొన్ని చోట్ల గ్రోయిన్లు, రివిట్‌మెంట్లు కనమరుగయ్యాయి. మరికొన్ని చోట్ల గ్రోయిన్లు పాడైపోవడంతో నదీపాతం మరింత ఎక్కువయిందని రైతులు ఆందోళన చెందుతున్నారు. కొట్టుకుపోయిన గ్రోయిన్లు, రివిట్‌మెంట్ల స్థానే నూతనంగా గ్రోయిన్లు నిర్మించాలని, రివిట్‌మెంట్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

రివిట్‌మెంట్ నిర్మించాలి



గోదావరి కోత ప్రభావం తీవ్రంగా ఉంది. బి.దొడ్డవరంలో కోత నివాస గృహాలను సమీపించింది. కోత వల్ల ఎంతో సారవంతమైన భూములు నదీగర్భంలో కలసిపోతున్నాయి. నెల నెలా ఆదాయాన్నిచ్చే కొబ్బరి చెట్లు నదిలో కూలిపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. కోత నివారణకు ప్రభుత్వం చర్యలు తీసుకుని రైతులను ఆదుకోవాలి. దీనిపై తక్షణం స్పందించాల్సిన ఆవశ్యకత ఉంది.

– వాకపల్లి వీరాస్వామి, బి.దొడ్డవరం

రైతులను ఆదుకోవాలి



వైనతేయ నదీతీరంలో కోత ప్రభావం తీవ్రంగా ఉంది. పెదపట్నం నుంచి గోగన్నమఠం వరకు ఉన్న తీర గ్రామాల రైతులు ఈ కోత వల్ల ఎంతో నష్టపోతున్నారు. కొబ్బరి తోటలతో పాటు కొబ్బరిచెట్లు నదిలో కూలిపోయి రైతులు తీవ్రంగా నష్టాల్ని చవిచూస్తున్నారు. కోత నివారణకు ప్రభుత్వం చర్యలు తీసుకుని రైతులను ఆదుకోవాలి. ఆ దిశగా చర్యలు చేపట్టాలని కోరుతున్నాం.

– కొమ్ముల చిన్న, పెదపట్నం

ప్రతిపాదనలు పంపించాం

వైనతేయ గోదావరి నదీతీరంలోని కుడి వైపు కోత నివారణకు రూ.82.73 కోట్ల అంచనాతో ప్రతిపాదనలు రూపొందించి పంపించాం. అప్పనపల్లి, పెదపట్నంలంక గ్రామాల్లో రూ.60.73 కోట్లు, బి.దొడ్డవరం, పాశర్లపూడి, ఆదుర్రు గ్రామాల్లో రూ.22 కోట్లతో గ్రోయిన్లు, రివిట్‌మెంట్ నిర్మాణం కోసం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు ద్వారా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరు కాగానే పనులు చేపడతాం.

– టీవీఎల్ఎస్ మూర్తి, హెడ్ వర్క్స్ ఏఈఈ, రాజోలు

మత్స్యశాఖాధికారి హేమానంద్ సస్పెన్షన్

అల్లవరం: అల్లవరం మత్స్యశాఖాధికారిగా విధులు నిర్వర్తిస్తున్న హేమానంద్‌ని సస్పెండ్ చేస్తూ రాష్ట్ర మత్స్యశాఖ కమిషనర్ కన్నబాబు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఫిష్ సర్వేను పూర్తి స్థాయిలో, సకాలంలో చేయలేకపోవడంతో ఆక్వా రైతులు విద్యుత్ రాయితీని కోల్పోయారు. ఫిష్ ఆంధ్ర షాపుల ఏర్పాటులో నిర్లక్ష్యం చేసినందుకు విధుల నుంచి తొలగించారని మత్స్యశాఖ జేడీ తెలిపారు. సీఆర్‌జెడ్ పరిధిలో అనధికారికంగా చెరువులు తవ్వుతున్నా పట్టించుకోకపోవడంపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నారు. అమలాపురం మత్స్యశాఖాధికారి సత్యకు అల్లవరం ఇన్‌చార్జి ఎఫ్‌డీఓగా బాధ్యతలు అప్పగించారు.

ఉచిత మెగా వైద్య శిబిరం


వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న కాకరపర్తి వెంకట్రావు తదితరులు

తాళ్లరేవు: ఇంజరం ప్రాథమిక పాఠశాలలో ఆదివారం కేవీఆర్ అంజలి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. సుమారు 200 మంది రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. ట్రస్ట్ ఎండీ కల్యాణ చక్రవర్తి, కార్డియాలజిస్టు జి.దుర్గా పవన్‌కుమార్, ఆర్థోపెడిక్ సర్జన్ పి.సూర్యప్రకాష్‌నాయుడు, జనరల్ మెడిసిన్ కన్సల్‌టెంట్స్ ఎస్‌వీవీ స్వామి, ఓవీ అఖిల్ కుమార్ శర్మ, ఫణికుమార్ సేవలందించారు. సర్పంచ్ ముద్దన వెంకట శివరామప్రసాద్, దుడ్డు సూర్యనారాయణమూర్తి, సీఎస్ఆర్ కృష్ణమూర్తి పాల్గొన్నారు.

వైభవంగా సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ ప్రతిష్ఠ

ముమ్మిడివరం: ముమ్మిడివరం మండలం కమిని పంచాయతీ పరిధి పొట్టితిప్పలో తిరుమల తిరుపతి దేవస్థానం, శ్రీవాణి ట్రస్ట్ ఆర్థిక సహకారంతో రూ.10లక్షలతో నిర్మించిన శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ ప్రతిష్ఠ మహోత్సవాలు ఆదివారం వైభవోపేతంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ సలాది రామచంద్రరావు, గొలకోటి వెంకటరెడ్డి, మంగతాయారు దంపతులు, పెన్నాడ శివనాగరాజు, గుత్తుల లక్ష్మీదుర్గ, మట్టా సూరిబాబు, గోదావరి జోన్ ప్రచారక్ జగన్నాథరావు పాల్గొన్నారు.

20న పుదుచ్చేరి అసెంబ్లీ సమావేశం

యానాం: 15వ పుదుచ్చేరి అసెంబ్లీ సమావేశం ఈ నెల 20న నిర్వహిస్తున్నట్లు అసెంబ్లీ కార్యదర్శి జె.దయాలనే ఆదివారం ప్రకటనలో పేర్కొన్నారు. ఆరోజు ఉదయం 9.30 నుంచి లెజిస్లేటివ్ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమవుతాయన్నారు. ఎల్జీ తమిళిసై సౌందరాజన్, సీఎం రంగసామి తదితరులు హాజరవుతారన్నారు.

తప్పు చేసిన ఏ ఒక్కరూ తప్పించుకోలేరు


ఎమ్మెల్యే చిట్టిబాబు

మామిడికుదురు: టీడీపీ అధినేత చంద్రబాబుకు 14 రోజులు రిమాండ్ విధిస్తూ ఏసీబీ కోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నట్లు ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు పేర్కొన్నారు. తప్పు చేసిన ఏ ఒక్కరూ చట్టం నుంచి తప్పించుకోలేరన్నారు. చంద్రబాబు విషయంలో ఇదే రుజువైందని చిట్టిబాబు పేర్కొన్నారు. ఇంతకాలం చట్టం నుంచి తప్పించుకున్న చంద్రబాబుకు ఇక తప్పించుకునే అవకాశం లేదన్నారు. చంద్రబాబు తప్పులను సమర్థిస్తూ వచ్చిన ప్రతిపక్షాలు ఇప్పుడు ఏం సమాధానం చెబుతాయని చిట్టిబాబు ప్రశ్నించారు. కోర్టు తీర్పుపై ప్రతిపక్షాలు స్పందించాలని చిట్టిబాబు డిమాండ్ చేశారు. తప్పు ఎవరు చేసినా దాన్ని ప్రతి ఒక్కరూ ఖండించాల్సింది పోయి సమర్థించడం హర్షణీయం కాదన్నారు. రూ.కోట్లలో అక్రమాలకు పాల్పడిన చంద్రబాబుపై ప్రభుత్వం తీసుకున్న చర్యలను ప్రజలు స్వాగతిస్తున్నారని చిట్టిబాబు చెప్పారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

అంబాజీపేట: కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. పురుగుమందు తాగి ఆస్పత్రి పాలయ్యాడు. మాచవరం శివారు అంబేద్కర్‌నగర్‌కు చెందిన యలమంచిలి తాతారావు స్థానిక మెట్లకాలనీ వద్ద కూల్ డ్రింక్‌లో పురుగుమందు కలిపి తాగాడు. స్థానికులు గుర్తించి అతడి బంధువులకు సమాచారమిచ్చారు. 108లో అమలాపురంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. కుటుంబ కలహాల కారణంగానే పురుగుమందు తాగాడని బంధువులు తెలిపారు.